## సజావుగా అగ్రి నాన్ టీచింగ్ ఉద్యోగుల ఎన్నికలు

### నేడు ఫలితాలు వెల్లడి


వ్యవసాయ యూనివర్సిటీ ( హైదరాబాద్) మే 16: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని నాన్ టీచింగ్ ఉద్యోగుల గుర్తింపు సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు ప్యానళ్లు బరిలోకి దిగడంతో పాటు రాజేంద్రనగర్ క్యాంపస్‌లోనే దాదాపు 400 మంది ఓటర్లు ఉండగా ఇక్కడే వారం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 697 ఓట్లు ఉండగా, అందులో ఇద్దరు ఇటీవలే రిటైర్ అయ్యారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 12 కేంద్రాలలో ఎన్నికలు జరగగా.. వాటిలో నాలుగు కేంద్రాలు రాజేంద్రనగర్‌లో.. మిగతా ఎనిమిది కేంద్రాలు ఆయా జిల్లాలో ఏర్పాటు చేశారు. మొత్తం 95% పోలింగ్ జరిగిందని, శనివారం రాజేంద్రనగర్‌లోని ఏజీ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ ప్రకటించారు. అయితే ఈ రెండు ప్యానళ్ల సభ్యులు విజయం తమదంటే తమదన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

## ఏఐ ఆధారిత మెంటార్‌షిప్ అవసరం: వివేక్ వర్మ

తెలుగు యూనివర్సిటీ, మే 16. వినూత్న ఆలోచనలతో మార్కెట్ సవాళ్లను ఎదుర్కొంటూ స్టార్టప్ ఏకోసిస్టంలో స్థిరమైన వ్యాపారం నిర్మించడంలో మార్గదర్శకుడిగా కృషి చేయగలనని ప్రముఖ స్టార్టప్ నిపుణులు వివేక్ వర్మ అన్నారు. రెడ్ హిల్స్ లోగల ఎఫ్ టీసీసీఐ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివేక్ వర్మ పాల్గొని హైదరాబాద్ లో వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ ఏకోసిస్టం అనే అంశంపై ప్రసంగించారు. భారత దేశంలోనే స్టార్టప్ హబ్ గా హైదరాబాద్ ఎదుగుతున్న తరుణంలో ఏఐ ఆధారిత మెంటార్‌షిప్ ను అనుసంధానం చేయడం అవసరమన్నారు. గ్లోబల్ మెంటార్‌షిప్ ధోరణులను గమనిస్తూ వాటికి అనుగుణంగా మార్పులు చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సంఘటిత మెంటార్‌షిప్ నెట్వర్క్, ప్రోత్సాహిక ప్రణాళికలు, విద్యా వ్యవస్థలలో ఇంటర్ ప్రిన్యూర్‌షిప్ కోర్సుల్లో మెంటార్ లను కనెక్ట్ చేయడం, ప్రభుత్వ డిజిటల్ ప్లాట్ ఫామ్ లలో ఆన్లైన్ పద్ధతిలో నైపుణ్యత కలిగిన మెంటర్ ల ను కనెక్ట్ చేయడం వంటి అంశాలపై ఆయన లోతుగా విశ్లేషించారు. హైదరాబాద్ లో 300వందలకు పైగా స్టార్టప్ లకు తాను మార్గదర్శకుడిగా కృషి చేస్తున్నానని వివరించారు.

# రైతు వరి గోస

## కన్నెర్ర చేసిన ప్రకృతి



గౌడవెల్లిలో వానకు కొట్టుకుపోయిన వడ్లు



సహకార సంఘం కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

- కన్నెర్ర చేసిన ప్రకృతి
- కనికరించని అధికారులు
- మిల్లర్ల తకరారు
- వడ్లు దళారుల పాలు
- సహకార సంఘం వద్ద రైతుల ఆందోళన

మేడ్చల్, మే 16 : రైతే రాజు అనే మాటకు కాలం చెల్లింది. ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెడుతున్న రైతులు వడ్లు కొనండంటూ బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.ఒక వైపు ప్రకృతి సహకరించకపోవడం, మరోవైపు అధికారులు, మిల్లర్ల మధ్య సమన్వయం లోపం, కొనుగోలు కేంద్రాల వద్ద తాలు, తేమ తదితర కారణాలతో తిరస్కారం.. వెరసి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. తప్పని పరిస్థితితో దళారులకు వడ్లను తక్కువ ధరకు అమ్ముకొని, నష్టపోతున్నారు. ఇది మేడ్చల్ మండలంలోని రైతు దుస్థితి.

మేడ్చల్ మండలంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. రైతులు వడ్లను ఆరబెట్టుకునేందుకు ప్రకృతి సహకరించడం లేదంటే కొనుగోలు కేంద్రాల వద్ద తేమ ఎక్కువ ఉందని తిరస్కరిస్తున్నారు. ప్రతి రోజు వర్షం పడుతుండటంతో ధాన్యం తడుస్తుండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానికంగా ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు దూరంగా ఉన్న సర్వీస్ రోడ్లు, బల్ల పరుపుగా ఉండే బండలపైన ఆరబెట్టుకుంటున్నారు. ధాన్యం ఆరింది అనుకునే లోపు వర్షం పడుతుండటంతో తేమ శాతం పెరుగుతుంది. గౌడవెల్లి గ్రామ పరిధిలోని రింగురోడ్డు సర్వీసు రోడ్డులో ఓ రైతు ఆరబెట్టుకున్న వడ్లు బుధవారం నాటి గాలి, వర్షానికి కొట్టుకొని పోయాయి. ఇలాంటి పరిస్థితిలో ఒకటి, రెండు పాయింట్లు నిబంధన ప్రకారం తేమ ఎక్కువగా ఉంటే తీసుకోకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అలాగే గతంలో తాలు గురించి పెద్దగా పట్టించుకునే వారు కాదని, ఇప్పుడు తాలు పేరుతో కూడా వడ్లను కొనుగోలుకు తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 కిలోలకు 41.5 కిలోల నుంచి 42 కిలోల వరకు ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్నా తీసుకోవడం లేదని రైతులు తెలిపారు. ముందుగా తాలుపై తమకెలాంటి సమాచారం లేదని, తూర్పారా బట్టేందుకు గాలి రావడం లేదని, అనువైన పరికరాలు కూడా తమ వద్ద లేవని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకులు చేతులు తడిపితేనే వడ్లను తీసుకుంటున్నారని రాయిలాపూర్, గౌడవెల్లి రైతులు ఆరోపిస్తున్నారు.

### ధాన్యం దళారులు పాలు..

తేమ, తాలు పేరుతో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బంది పెడుతుంటే రైతులు పక్క చూపులు చూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడి, అధికారులను బతిమాలుకునే కన్నా ఎంతకైతే అంతకు దళారులకు అమ్ముకోవాలని చూస్తున్నారు. రాయిలాపూర్‌కు చెందిన సత్తిరెడ్డి అనే రైతు కొనుగోలు కేంద్రం వద్ద బాధపడ లేక 220 క్వింటాళ్ల సన్న వడ్లను 2150 క్వింటాల్ చొప్పున అమ్ముకున్నాడు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించి ఉంటే రూ.500 బోనస్ కలుపుకొని రూ.2820 క్వింటాల్‌కు వచ్చేది. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ..670 చొప్పున 220 క్వింటాళ్లకు రూ.1,47,400 నష్టపోయాడు. అదే గ్రామానికి చెందిన మరో రైతు శేఖర్ రెడ్డి 250 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్లను రూ.2030కే అమ్ముకున్నాడు. ఆయనకు క్వింటాల్‌కు రూ.270 చొప్పున రూ.67,500 నష్టం వచ్చింది. ఇలా మండలంలోని వేల క్వింటాళ్లో ధాన్యం దళారుల పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగాశుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణాబాయి, ఏడీఏ వెంకట్ రాంరెడ్డి, ఏవో అర్చన సందర్శించారు. తేమ17 శాతం కంటే తక్కువగా ఉండాలని, ధాన్యంలో తాలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## సహకార సంఘం వద్ద ఆందోళన

మేడ్చల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద గురువారం రాయిలాపూర్, గౌడవెల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేశారు. తేమ, తాలు తదితర కారణాలతో తమ వడ్లను కొనుగోలు చేయకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడు తమకు రాలేదని, రైతుల కష్టాన్ని గుర్తించడం లేదని మండిపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారిణి అర్చన సహకార సంఘం కార్యాలయానికి చేరుకుని, రైతులతో చర్చించారు. నిబంధనల ప్రకారం 100 కిలోలకు కిలో తాలు ఉండాలని కానీ 40 కిలోలకు 3, 4 కిలోల తాలు వస్తుందన్నారు. ఎఫ్‌సీఐ తిర్కసరిస్తున్న కారణంగా మిల్లర్లు తీసుకోవడం లేదన్నారు. రైతులు తాలు లేకుండా చూసుకోవాలని, నిబంధనల ప్రకారం తేమ పాటించాలని సూచించారు. కాగా భూదాన్ పోచంపల్లిలో ఉన్న మిల్లర్‌తో ఏవో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ప్రకృతి సహకరించక ఇబ్బంది పడుతున్నారని, 2, 3 శాతం తాలు ఉన్నా తీసుకోవాలని కోరారు. 40కి 42 కిలోల బస్తాలో ధాన్యం పంపిస్తారని, అంగీకరించాలన్నారు. ఇందుకు మిల్లర్ మాట్లాడుతూ తాలు ఎక్కువగా ఉంటే తీసుకోలేమని తేల్చిచెప్పాడు.

## రేపు సచివాలయం సందర్శన

### సందడి చేయనున్న మిస్ వరల్డ్ కంటిస్టెంట్స్

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సచివాలయం, పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆదివారం మిస్ వరల్డ్ కంటిస్టెంట్స్ సందర్శించనున్నారు. కేసీఆర్ పాలనలో నిర్మించిన అద్భుత నిర్మాణాలను ప్రపంచ అందగత్తెలు వీక్షించనున్నారు. ట్రైడెంట్ హోటల్ నుంచి సచివాలయం చేరుకొని తెలంగాణ చరిత్ర తెలుసుకోనున్నారు. అక్కడే అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ సండే ఫండేలో అందాల బామలు సందడి చేయనున్నట్టు అధికారులు తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యాటకులకు ఏ విధమైన భద్రత కల్పిస్తారో ముద్దుగుమ్మలకు వివరించనున్నారు. కాగా, నేడు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కంటిస్టెంట్స్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారు. అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

## రక్షణ దళాల పరాక్రమానికి ఎస్‌సీఆర్ సంఘీభావం

### ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా సికింద్రాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): భారత రక్షణ దళాల పరాక్రమానికి సంఘీభావంగా శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సంగీత్ జంక్షన్ నుంచి రైల్వే నిలయం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్‌సీఆర్ సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ జీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌సీఆర్ డిప్యూటీ చీఫ్ మెటీరియల్ మేనేజర్ ఏకే రావత్, విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ఆర్ షెల్కెత్ తదితరులు పాల్గొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉగ్రవాదాన్ని అంతమొందించడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి, పరాక్రమానికి సంఘీభావంగా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## సింగరేణిలో విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న అరుణోదయ విమల

కవాడిగూడ, మే 16: సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని అరుణోదయ సంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు విమల, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్‌రావు అన్నారు. సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్‌పెండింగ్ కేసుల బాధితుల ఆధ్వర్యంలో తమ న్యాయ మైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో దరఖాస్తు చేసుకున్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో ఉద్యోగాలు రాక, ఉపాధి మార్గం లేక ఇబ్బందులు పడుతున్న వారికి కుటుంబ పోషణ భారంగా మారిందని చెప్పారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అందాల పోటీలను నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి సింగరేణి మారుపేరు బాధితులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బాధితులు చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బాధితులు శ్రవణ్, తిరుమల శ్రీనివాస్, సంతోస్, రంజిత్, ఓంప్రకాష్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా బెల్లంపల్లిలో పర్యటించిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. డిపెండింగ్ ఉద్యోగులు 1200 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని, ఉద్యోగాలు కల్పించాలని వారు కోరారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

## 'సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయం'



పుప్పాలగూడలో కల్నాల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదరణ చేపట్టిన మైనారిటీ నాయకుల దృశ్యం

మణికొండ, మే 16 : భారత సైనిక కల్నల్ సోఫియా ఖురేషీ ..ఉగ్రవాదుల సహోదరి అంటూ మధ్యప్రదేశ్ రాష్ట్రమంత్రి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మణికొండ మున్సిపాలిటీ మైనారిటీ సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. దేశ శాంతి భద్రతల కోసం సంపూర్ణ దేశభక్తితో పనిచేస్తున్న భారత సైనికురాలు సోఫియా ఖురేషి ని ఉద్దేశించి.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఓ వ్యక్తి కించపరడం పట్ల మైనారిటీ సంఘాల ప్రతినిధులు తీరస్థాయిలో మండిపడ్డారు.

శుక్రవారం మణికొండలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న వారు.. సోఫియా ఖురేషీ ఒంటరి మహిళ కాదని ఆమె వెనుక దేశంలోనే లక్షలాదిమంది మైనారిటీ ప్రజలు ఉన్నారని హెచ్చరించారు మైనార్టీ లలోను దేశభక్తులు ఉన్నారని వారి అందరి మనసును గాయపరిచే విధంగా మంత్రి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మరింత జాతీయ పతాకాన్ని చేతబూని జైహింద్ జై భారత్ అంటే నినాదాలు చేపట్టారు ఈ కార్యక్రమంలో ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షేక్ ఆరిఫ్, ప్రతినిధులు అందే లక్ష్మణ్ రావు, ఇతర మైనారిటీ విభాగం చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిమ్స్ కు స్లిట్ ల్యాంప్ బహూకరణ



స్లిట్ ల్యాంప్ ను పరిశీలిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, మే 16: నిమ్స్ ఇమ్యూనాలజీ, రూమటాలజీ పీడియాట్రిక్ విభాగంలో చికిత్స తీసుకుంటున్న చిన్నారుల కంటి పరీక్షల కోసం ఉపయోగపడే విలువైన పరికరాన్నిఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ బహూకరించింది. ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో ఒకటైన జూవనైల్ ఇడియోపతిక్ ఆర్థరైటీస్ (జీఐఏ)తో బాధపడే చిన్నారులకు కంటి చూపు సమస్య తలెత్తుంది. నిమ్స్ ఇమ్యూనాలజీ, రూమటాలజీ పీడియాట్రిక్ విభాగంలో ఈ సమస్యతో బాధపడే చిన్నారులకు చికిత్సను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి కంటి పరీక్షల కోసం స్లిట్ ల్యాంప్ ఎంతో ఉపయోగపడుతుంది. శుక్రవారం ఈ పరికరాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటీవ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ పీడియాట్రిక్ రుమటాలజీ విభాగంలో జీఐఏ సమస్యతో చికిత్స తీసుకున్న చిన్నారులు కంటి పరీక్షల కోసం ఇతర ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేదని, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ బహూకరించిన ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఆప్తమాలజిస్టులు ప్రతి మంగళవారం ఈ పరికరంతో పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బసు, డాక్టర్ షప్తాప్, పీడియాట్రిక్ రుమటాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ కీర్తివర్ధన్ పాల్గొన్నారు.

## మ్యాన్ హోళ్లలో బ్లాంకెట్లు.. బెడ్ షీట్లు

### నల్గొండ చౌరస్తా డీ-సిల్టింగ్ లో వెలితీత

సిటీబ్యూరో, మే16, (నమస్తే తెలంగాణ): మురుగునీరు సజావుగా వెళ్లాల్సిన డ్రైనేజీ పైపుల్లో ఏకంగా పెద్ద పెద్ద బ్లాంకెట్లు, బెడ్ షీట్లు కూడా వేస్తున్నారు. దీంతో మురుగునీటికి అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం జలమండలి పరిధిలోని నల్లగొండ చౌరస్తా సమీపంలో మురుగు నీటికి అడ్డంకులను తొలగించేందుకు జెట్టింగ్ యంత్రాలను వాడగా.. అందులో దుప్పట్లు కనిపించాయి. గతంలో చాలా చోట్ల దిండ్లు, పరుపులు కూడా లభ్యమైన సందర్భాలు లేకపోలేదు. కాగా అనేక ప్రాంతాల్లో తరుచూ మురుగు పొంగిపొర్లుతున్న ఫిర్యాదులు నమోదు కావడంతో అధికారులు డీ- సిల్టింగ్ పనులు చేపట్టి మ్యాన్ హోళ్లనుంచి బ్లాంకెట్లు, బెడ్ షీట్లు, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులను బయటకి తీశారు. కాగా, నగరవాసులు బాధ్యతాయుతంగా వ్యవహరించి డ్రైనేజీ పైపుల్లో ప్లాస్టిక్ సామాన్లు, బట్టలు వంటివి వేయకుండా చూడాలని జలమండలి అధికారులు సూచిస్తున్నారు.

## వీధిదీపాల నిర్వహణపై బల్దియా దృష్టి

సిటీ బ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): నగరవ్యాప్తంగా వీధి దీపాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు గత నెల ఈఈఎస్ఎల్ ఏజెన్సీ ఒప్పందం ముగియడంతో మే 1వ తేదీ నుండి వీధి దీపాల నిర్వహణను జీహెచ్ఎంసీయే నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగానే నూతన అడిషనల్ కమిషనర్ నియామకం జరిపారు. జోన్ వారిగా స్ట్రీట్ లైట్లు, తదితర సామాగ్రిని కొనుగోలు చేశామని, రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. వీధిదీపాలను బిగించడానికి 17 ఏజెన్సీలను మరికొన్ని రోజులు కొనసాగిస్తామని చెప్పారు. వీధి దీపాల సమస్యలపై ఇప్పటి వరకు అందిన 9,000 ఫిర్యాదుల్లో 5,800 ఫిర్యాదులను పరిష్కరించామని, మిగిలిన వాటిని వారంలోపు పరిష్కరిస్తామని తెలిపారు. వీధి దీపాల సమస్యలను మైజీహెచ్ఎంసీ యాప్ ద్వారా తెలియజేయాలని అధికారులు సూచించారు.

## పేరొకరిది.. వైద్యం మరొకరిది

### గ్రేటర్ పరిధిలో ప్రైవేట్ వైద్యుల నిర్వాకం

### చర్యలు చేపట్టకుండా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చోద్యం

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): కాలునొప్పి, కంటి నొప్పి అంటూ కనబడిన ప్రైవేట్ దవాఖానలకు వెళ్తే మన ఆరోగ్యాన్ని మనమే చేతులారా పాడు చేసుకున్నవారమవుతాం. పేరుకు పెద్దాసుపత్రని వెళ్లినా ప్రాణాలు కోల్పోయేవారమవుతాం. వైద్యం పేరుతో జరిగే దోపిడీలో సామాన్యులు నలిగిపోతున్నారు. తెల్లకోటు వేసుకున్నవాళ్లంతా వైద్యులే అనుకుంటూ ప్రజలు జీవిస్తున్నారు. కొంతమంది వైద్య వృత్తిని అడ్డంపెట్టుకొని అడ్డగోలు అక్రమ సంపాదనకు తెరతీస్తున్నారు. తమ పేరుతో ఆసుపత్రి రిజిస్ట్రేషన్ చేసుకొని అర్హతలేని.. వేరొకరితో వైద్యం చేయిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారు.

### తనిఖీలకు మంగళం...

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 10 వేల ప్రైవేట్ దవాఖానలు రిజిస్టర్ కాగా, వాటిలో 70శాతం ఆసుపత్రుల్లో తమ పేరుతో రిజిస్ట్రేషన్ ఉన్న వైద్యులు కాకుండా ఇతరులు వైద్యం చేయడం గమనార్హం. ఇలా ఏండ్ల తరబడి అర్హత లేని వ్యక్తులతో వైద్యం చేయిస్తూ, అసలైన వైద్యులు బడా కార్పొరేట్ దవాఖానల్లో పనిచేస్తున్నారు. అసలు ఒక వ్యక్తి వైద్యం అందించాలంటే ముందుగా అతడు జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తించిన మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అప్పుడే అతడు వైద్యం చేసేందుకు అర్హుడు. దానితో పాటు ఆసుపత్రి నడపాలంటే జిల్లా వైద్యాధికారి అనుమతి ఉండాలి. క్లినిక్, ఆసుపత్రిల లైసెన్స్ విషయంలో జిల్లా వైద్యాధికారిదే నిర్ణయం. ఈ తరహా అనుమతులు ఇచ్చి ఇటు జిల్లా వైద్యశాఖ, మరోవైపు మెడికల్ కౌన్సిల్ తనిఖీలు చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆడిందే ఆట పాడిందే పాట తీరుగా సాగుతుంది.

### నకిలీ వైద్యులంటే..ఆర్ఎంపీలా..!

మెడికల్ కౌన్సిల్ ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రులపై దాడులు చేయడంలో వెనకడుగు వేస్తుంది. ఫిర్యాదులొస్తే గానీ చర్యలు తీసుకోవడం లేదు. నకిలీ వైద్యులంటే ఆర్ఎంపీలు, చిన్న చిన్న క్లినిక్‌లను మాత్రమే టార్గెట్‌గా చేసుకొని దాడులు నిర్వహిస్తున్న మెడికల్ కౌన్సిల్.. పెద్ద ఆసుపత్రుల్లో పనిచేసే నకిలీ వైద్యుల అంతు చూడటం లేదు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

## కన్పించే దేవుళ్లు డాక్టర్లు

### మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, మే 16: కన్పించే దేవుళ్లు వైద్యులని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి గొప్పదని, దేవుడు జన్మనిస్తే వైద్యులు చావు బతుకుల్లో ఉన్న వారికి పునర్జన్మ ఇస్తారన్నారు. ఈ వృత్తిలోకి వచ్చిన వారు మానవతా ధృక్పథంతో నిరుపేదలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గోపాల్ రెడ్డి, సీఈవో అభినవ్ రెడ్డి, కార్యదర్శి వసంత లత, యాజమాన్య కమిటీ సభ్యులు అనురాగ్ రెడ్డి, ఐశ్వర్య, డీన్ డాక్టర్ వెంకట రమణయ్య, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ బీఎన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ అలీ బేగ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీగా మీర్జా రియాజ్ ప్రమాణ స్వీకారం..

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసన మండలిలో శుక్రవారం హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మీర్జా రియాజ్ ఉల్ హస్సన్ ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డా. నరసింహాచార్యులు, ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మీర్ జుల్ఫికర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన అజరామరం పద్య నాటకం



జ్యోతి ప్రజ్వలన అనంతరం నాటకాన్ని ప్రారంభిస్తున్న గోరెటి వెంకన్న, డా.నామోజు బాలాచారి, దోరవేటి

రవీంద్రభారతి, మే 16: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్తంగా అజరామరం చారిత్రక పద్యనాటకం, అనంత ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, ప్రొఫెసర్ డా.ఎం.బాగయ్య, డా.అమ్మంగి వేణుగోపాల్, బోబ్లాద్ రాఘవేంద్రాచార్యులు, బీపీ నర్సింహులు గుప్తా, డా.ఈటెల సమ్మన్న, అనంత వ్యవస్థాపకుడు దోరవేటి తదితరులు విచ్చేసి అజరామరం పద్య నాటకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అజరామరం చారిత్రక పద్య నాటకం ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న నాటక రంగాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంత వ్యవస్థాపకుడు దోరవేటి, అనంత ప్రధాన కార్యదర్శి తలారి ఆశీర్వాదం, పట్టాల అశోక్, తుల్జారాం సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే.. డెంగీకి అడ్డుకట్ట

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి
- జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్యానికి ప్రధాన ప్రతిబంధకాలైన దోమలను అరికట్టి డెంగ్యూ సోకకుండా చూడాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురికి కాలువలలో చెత్తాచెదారం తొలగించి మురుగునీరు పారే విధంగా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరు టైర్లు, కూలర్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని మురికివాడల్లో ముందస్తు ప్రణాళికలు తయారుచేసి దోమల ద్వారా వచ్చే వ్యాధులను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఇప్పటి నుంచే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే డెంగ్యూ జ్వరాలను తగ్గించడంలో గణనీయమైన ఫలితాలు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, ఇన్‌చార్జ్ మలేరియా అధికారి డాక్టర్ శ్రీకళ పాల్గొన్నారు.

## బీపీని అదుపులో ఉంచుకోవాలి..

### కేర్ హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ

మలక్ పేట మే 16: 30 ఏండ్లు పైబడిన ప్రతిఒక్కరూ బీపీని అదుపులో ఉంచుకోవాలని సీనియర్ కన్సల్టెంట్, కేర్ హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 22 కోట్ల మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారని అన్నారు. హైపర్ టెన్షన్‌కు మొదటి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవని, అందుకే దీన్ని మౌన హంతకుడు అంటారని అన్నారు. హైపర్ టెన్షన్‌ను నియంత్రించకపోతే శరీర అవయవాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు, చూపు కోల్పోవడం, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. రెండవ హైపర్ టెన్షన్ మూత్రపిండాల వ్యాధులు, హార్మోన్ వ్యత్యాసాలు, స్లీప్ అప్నియా వంటి సమస్యల కారణంగా వస్తుందన్నారు. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు లేకపోయినా నియంత్రించని ఎడల రక్తపోటు వల్ల తలనొప్పి, తల నిలువుగా తిరగడం, మబ్బుగా కనిపించడం, అలసట, చాతిలో నొప్పి, గుండెచప్పుడు అనుమానంగా ఉండటం, శ్వాసలో ఇబ్బంది వంటి సంకేతాలతో గుర్తించవచ్చన్నారు. వీటిని నియంత్రించేందుకు ఔషధాలతో పాటు గుండెకు మేలైన జీవనశైలిని అందించడం, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే ధ్యానం వంటివి రక్తపోటును నియంత్రించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. రోజుకు ఐదు గ్రాముల కంటే తక్కువ ఉప్పును తీసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవడం రోజువారీ వ్యాయామం, ధ్యానం వంటి సాధనలతో దీనిని నియంత్రించవచ్చునని ఆయన తెలిపారు.